క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పెందుర్తి తహసీల్దార్‌గా వెంకటరావు



తహసీల్దార్ వెంకటరావు

పెందుర్తి: మండల తహసీల్దార్‌గా ఎస్.వెంకటరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో పనిచేసిన వెంకటరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పెందుర్తి తహసీల్దార్‌గా పనిచేసిన పి.శ్యాం ప్రసాద్ బదిలీపై విజయనగరం జిల్లా భోగాపురం వెళ్లారు.

జెడ్సీ హేమావతి బాధ్యతల స్వీకరణ



జెడ్సీ హేమావతి

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 జోనల్ కమిషనర్‌గా కె.హేమావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్యదర్శిగా పని చేసిన ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. జోన్–8 జెడ్సీగా పని చేసిన ఎం.మల్లయ్యనాయుడు బదిలీపై విజయనగరం వెళ్లిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న అధ్యాపకులు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్(ఫుల్ అడిషనల్ చార్జి)గా సీనియర్ అధ్యాపకుడు శరగడం శ్రీనివాసరావు నియమితులయ్యారు. శుక్రవారం కళాశాలలో బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు ఆనంద్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



కీర్తి స్పందన

పరవాడ: మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుంటానని ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన అన్నారు. ఆమె అధికారులతో సమీక్షించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ గుంటుబోయిన రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో రాష్ట్ర ఎంప్లాయీస్ గౌరవ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



గొల్లపాలెంలో సచివాలయ అదనపు అంతస్తును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అమరపిన్నివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- రూ.2.30 కోట్లతో నిర్మించిన భవనాలు ప్రారంభం

సబ్బవరం: ప్రతి సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కోట్లాది రూపాయలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శుక్రవారం సుడిగాలి పర్యటన చేసి పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఒక్కో సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ఇంటింటికీ అందిస్తున్నామన్నారు. సంక్షేమం తప్పా అభివృద్ధి లేదని కొంతమంది అంటున్నారని .. అలాంటి వారంతా గ్రామాలకు వెళ్లి చూస్తే అభివృద్ధి కనిపిస్తుందన్నారు.

చెంతనే పాలన

గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయంలోనే ప్రజలకు అందుబాటులో పాలన అందుతుందన్నారు. వ్యవసాయం చేసే రైతులు విత్తనాలు, ఎరువులు కోసం తిరిగేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లోనే ప్రభుత్వం ఏర్పాటు చేసి అన్నిరకాల సేవలు,సూచనలు అందించడం జరుగుతుందన్నారు.

చేపట్టిన కార్యక్రమలు

- మండలంలోని ఆరు సచివాలయ పరిధిలో రూ.2.30 కోట్లతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు.
- వీటిలో నారపాడు సచివాలయం పరిధిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, అసకపల్లిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రంతో పాటు పైడివాడ అగ్రహారంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు.
- గొల్లలపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు అందస్తుతో పాటు రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్,రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని,రూ.11.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, అమృతపురంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్‌ను,రూ.11.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని,తవ్వవానిపాలెం సచివాలయం పరిధిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ నాయకులతో కలిసి ప్రారంభించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు,ఎంపీడీవో రామ్మోహనరావు, పంచాయతీ రాజ్ డీఈ సత్యనారాయణమూర్తి, ఏఈ అర్జున అప్పారావు, ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి,సీనియర్ నాయకులు,సర్పంచ్‌లు,ఎంపీటీసీల మామిడి కొండాజీ,కాపుశెట్టి శేషుబాబు,కర్రి అప్పారావు,వద్దాది అప్పలరాజు,పెచ్చేటి రమేష్ నాయుడు,కొమ్ము కనకరాజు,బైలపూడి గౌరి,బైలపూడి రామారావు,సిగంపల్లి శ్రీనివాసరావు,బోకం స్వామినాయుడు, బోకం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక



రజనిని పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సీపీఎం కీలక నాయకురాలు ఎం.రజని ఆధ్వర్యంలో దాదాపు 100 మంది సీపీఎం కార్యకర్తలు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన చూసి ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రజని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రజారంజక పాలన చూసే తాము వైఎస్సార్‌సీపీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అన్నంరెడ్డి అజయ్ రాజ్, మెంటి మహేష్, చిరికి దేముడు తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా పూర్వ విద్యార్థులు



లవన్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నేటి తరానికి మార్గదర్శకులుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న లవన్‌కుమార్ వీసీని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ పూర్వ విద్యార్థులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా లవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో న్యాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లవన్‌కుమార్ పాల్గొన్నారు. పోటీ పరీక్షలను సన్నద్ధం కావడం, యూపీఎస్సీ పరీక్షలకు సన్నాహం, న్యాయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అంశంపై ఆయన అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో న్యాయ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలను వివరించారు. తాను ఇక్కడ విద్యార్థిగా చదువుకుని నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పని చేస్తున్న విధానం, దీనికి తాను పడ్డ శ్రమ, కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చక్కని ప్రణాళికతో పరీక్షలను సిద్ధమవుతూ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకర రావు, వగీర, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల దర్శకుడు విశ్వనాథ్



కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులర్పిస్తున్న అతిథులు

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం విశ్వనాథ్ చిత్రాలు, సాహిత్యం, సమాజం అనే అంశంపై ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో గ్రంథాలయ సొసైటీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ క్రమశిక్షణ కలిగిన దర్శకుడని, విలువల కోసం కట్టుబడిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సినీ చరిత్రలో విశ్వనాథ్ ఒక యుగకర్తగా అభివర్ణించారు. నవ సాహితి ఇంటర్నేషనల్ నిర్వాహకుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విశ్వనాథ్‌తో తన అనుభవాలను వివరించారు. రాంభట్ల నృశింహశర్మ మాట్లాడుతూ విశ్వనాథ్ చిత్రాల్లోని సాహిత్యం, సాంస్కృతిక విలువలను వివరించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, చిట్టెళ్ల నిర్మల, బి.వెంకటరావు, యడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్‌కు డిమాండ్



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్, టెలికాం, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలని స్టీల్ సీఐటీయు కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం కార్మికుల బకాయిల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్ల బిల్లుల నుంచి ప్రతీ నెలా ఫుల్ అండ్ ఫైనల్ కోసం రికవరీ చేసే సొమ్మును కార్మికులకు యాజమాన్యమే చెల్లించాలన్నారు. ఈ అంశంపై యాజమాన్యం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఒ.వి.రావు, ఎస్.రమణ, జి.శ్రీనివాస్, సోమేష్, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ'

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1086వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా



అధిర్ అరోరాకి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత ప్రభుత్వ చీఫ్ హైడ్రోగ్రాఫర్ వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.1,000 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న ఏయూలో నిక్ స్ఫూర్తిదాయక ప్రసంగం



ఏయూ క్యాంపస్: ప్రపంచాన్ని తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఆకట్టుకుంటున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఈ నెల 6న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేయనున్నారు. చిన్నతనంలో చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్.. తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉందని నిర్ణయించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా నిక్ చలించలేదు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.

ధూమ్‌ధామ్‌గా గాజువాక ఉత్సవ్



ఎగ్జిబిషన్‌లో పిల్లల సందడి

గాజువాక: గాజువాక సీతారామ ఉమారామ లింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం(గాజువాక ఉత్సవ్) శుక్రవారం వైభవంగా జరిగింది. ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గాజువాక బీసీ రోడ్డులో సందడి చోటుచేసుకుంది. ఈ ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి), గంధం శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, గోమాడ వాసు, నాయకులు గంధం వెంకటరావు, తిప్పల రమణారెడ్డి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు గాజువాక వాసులకు కనువిందు చేశాయి.

సింహగిరిపై వైభవంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహ స్వామి జన్మ నక్షత్రమైన ప్రతి స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకు వచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టింపజేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు హోమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

260 మందికి వైద్య పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో పంచాయతీ కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సౌకర్యార్థం జగనన్న ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పాల్గొన్న 260 మంది రోగులకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ జానిత్‌రెడ్డి, డాక్టరు మహేష్, డాక్టర్ క్రాంతి కుమార్ సేవలు అందించారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటరావు రోగులకు కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, పార్టీ నాయకులు సూరాడ చినమసేను, సూరాడ స్వీడు మసేను, అరిజిల్లి మసేను, ఎం.కొండబాబు, ఎం.అప్పన్న, సీహెచ్.అప్పారావు, శివ, అరిజిల్లి చంటి, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కృష్ణారావు, సత్యనారాయణ, ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవివరం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగిస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. నాడు–నేడు పనుల పురోగతిని పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచేలా స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని డీఈవోకు వివరించారు.

ప్రభుత్వరంగాన్ని రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,037వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సెక్రటరీ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే దేశానికి పట్టుకొమ్మలని, మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, లేకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. దీక్షలో వై.రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పంచాయతన యాగ మహోత్సవం



వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య యాగాలు నిర్వహిస్తున్న సాయికాంత్‌శర్మ దంపతులు

ఎంవీపీ కాలనీ: శ్రీసరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీశారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్‌శర్మ దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో యాగాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, రుద్రాభిషేకం, మండపారాధనతో పాటు లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం చేశారు. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆరోగ్యప్రదాయిని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి

- అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- ఆస్పత్రిలో బ్రాకీ థెరపీ యూనిట్ ప్రారంభం

అగనంపూడి: క్యాన్సర్ రోగుల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం నిలుస్తోందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అన్నారు. అగనంపూడిలోని ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాకీ థెరపీ సూట్ బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడిన ఎంతో మందికి ఈ ఆస్పత్రి వరప్రదాయినిగా నిలిచి, సేవలందించడం జిల్లాకే గర్వకారణమన్నారు. సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను, అక్కడి వసతులను పరిశీలించారు. సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ మహంతి, జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్, ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.